# దేముడివ్వని వరం

- ఎన్. రాజేశ్వరి

"ఇది కలా? నిజమా? ఆశ్చర్యమో... ఆనందమో... అర్థంకావటల్లేదు... రేఖకి. అవును మరి... నాలుగో వదిలో అడుగిడబోతున్న తనకి... పెళ్ళేమిటి? వింతగా లేదు? ఎంత మంచి ఉద్యోగం ఉంటే మాటుక్కు? ఎంత డబ్బుంటేనేం? పెళ్ళికానప్పుడు? కొందరికి డబ్బులేక... మరి కొందరికి ఉద్యోగం లేక... ఇంకా కొందరికి అందంలేక... తను మూడో కోవకు చెందింది. అందుకేగా... తను శుభలేఖలు ఇస్తుంటే.... సాటి ఉద్యోగులందరు వింతగా, వ్యంగ్యంగా..." ఈ మొహాన్నెవడు చేసుకునేది? అన్నట్లు, హేళనగా చూసారు. పోన్లే... ఇప్పుడికైనా... ఎవడో ఒకడు అన్నట్లు మరి కొందరు జాలిపడ్డారు

వాడెటువంటి వాడైనా... మొగుడనేవాడు మాత్రం ముఖ్యం. లేకపోతే ఆడది ఒంటరిగా జీవించటం కష్టం.

ఇంటా బయటా ఎంత హీనంగా మాట్లాడే వారనీ. అదేదో పెద్ద ఘోరమైనట్లు "ఎన్నేళ్ళలా ఉంటావ్? అవున్లే ఉద్యోగం చేస్తున్నావ్‌గా... మగాళ్ళ మధ్య తిరిగి తిరిగి... పెళ్ళే గుర్తు రాదేమో... చేతినిండా డబ్బు ఇంకేంకావాలి? ఇదే బాగుంటుంది. పెళ్ళి చేసుకుంటే అన్నీ కట్టుబాట్లు... చెప్పుచేతలు... వాడు చెప్పినట్లు నడుచుకోవాలి. ఇలా స్వేచ్ఛగా హాయిగా ఉండచ్చు, ఇలా అనేక రకాల కుళ్ళు మనను నిండా పెట్టుకొని మాట్లాడేవారు బంధువర్గం. ఆఫీసులో సరేసరి "నీకెలాగు లైసెన్సు లేదు. ఇంకెవడు ఇప్పుడు కట్టడుగానీ... మాలో ఎవరినైనా కట్టమంటావా? సెకండ్‌హాండ్ అయితే మటుకేం? ఇంత లేటుగా నీకు ఫస్ట్ హాండ్ ఎవడొస్తాడు చెప్పు? ఎటూ నీ సంపాదన ఉందికదా. ఎవడో ముక్కు మొహం తెలియని వాడొచ్చినా... నువ్వు కష్టపడి కూడబెట్టిందంతా ఒక్కరోజులో తాగి తగలేస్తాడు" అంటూ నోరు పారేసుకునేవారు. నిజానికి తను పెళ్ళంటే అందరిలాగా తియ్యని కలలు కనలేదు. తన దృష్టిలో అదొక చేదు భావం. అయినా ఈ మనుషులకి ఇంతకంటె మంచితనం ఎక్కణ్ణుంచొస్తుంది?... లోకం తీరె అంత" వినీ వినీ తనకింక మనసు మొద్దుబారిపోయింది. అందుకే వీళ్ళందరికి బుద్ధి చెప్పటంకోసం ప్రతి ఒక్కరిని



ఆహ్వానించింది.

అయినా తనంత అనాకారేం కాదు. అందరిలా ఆకర్షణ కోసం, వన్నెలు చిన్నెలు అలంకరణలు చేసుకోదు. ఆకర్షణ కోసం వెర్రి మొర్రి మెరుగులు దిద్దుకోదు. పైగా కొందరు మరీ మొహం మీదే... "ఏమిటోయ్ రేఖా మరీను గెడకర్రకి బట్టలు చుట్టినట్లు? ఏం వంపులు లేకుండా?" అని తనని మరింత కుంగదీస్తారు బాధపడుతుందనైనా లేకుండా. అందుకే మరీ విరక్తి. అద్దంలో చూసుకుంటే అవే గుర్తొస్తాయ్... దాంతో మరీ నిర్లక్ష్యంగా ఉంటుంది.

పైగా ఎవరితోను రాసుకు పూసుకుని వెకిలి వేషాలు వెయ్యదు. అది నగం ఏడుపు అందరికీ. మనిషెలా వున్నా వాళ్ళతో చేరి వెకిలి వేషాలు వేస్తే అప్పటికప్పుడు మజా అనుభవించి, వెనుక నుంచి తాటాకులు కట్టటం మగజాతి లక్షణం. మిగతా ఆడవాళ్ళ విషయంలో తను చూస్తూనే ఉంటుంది. అందుకే తనకూ నచ్చక దూరంగా, అన్నిటికీ అతీతంగా యోగినిలా గడిపేస్తుంది.

అంతెందుకూ? ఇక తనకీ లైసెన్సు వస్తుంది. ఎవ్వరు వెర్రి వేషాలు వెయ్యక్కర్లేదు. చిల్లరగా వాగక్కర్లేదు. తనకి అండగా మరొక వ్యక్తి... తన మంచి చెడ్డలు బాగోగులు చూసుకోవడానికి నీడగా తనకి రక్షణగా మరొక వ్యక్తి" అలా అనుకుంటే ఏదో అవ్యక్తమైన అనుభూతి. మనసునిండా ఆనందం... సంతృప్తి... ఏది చెప్పలేని గర్వం. తనింకా ఒంటరిది కాదు. అవును. అతనికి మాత్రం ఏం తక్కువ? ఇంద్రుడు చంద్రుడు మన్మధుడు కాకపోవచ్చు. మామూలు మనిషిగా లక్షణంగా ఉన్నాడు. తన ఒక్క సంపాదన చాలక ఉద్యోగం చేసే అమ్మాయి కావాలనుకున్నాడు. తానివ్వబోయే కట్నంతో చెల్లెలి పెళ్ళి చెయ్యాలనుకోవటం నేరం కాదుగా! తను మాత్రం ఏం చేసుకుంటుంది? బోలెడు సంపాదిస్తోంది. వున్న ఒక్క తమ్ముడికీ ఈ మధ్యే ఉద్యోగం వచ్చింది. అక్కపోయాక అమ్మ బొత్తిగా మతిలేనిదైంది. ఏదో ఓ మూల పిచ్చిదానిలా కూచుంటుంది.

అక్క గుర్తొస్తే చాలు. అలా ఎటో నడిచి వెళ్ళిపోతూ ఉంటుంది. నాన్నే పాపం! కూడా వుండి అమ్మని వెన్నంటి చూసుకుంటూ వుంటారు.

నిజానికి అక్క తనకంటే బాగానే ఉండేది. అన్ని విధాలా ఇష్టపడే చేసుకున్నాడు. ఏం ప్రయోజనం? అక్క చదువుకోలేదన్న నెపంతో హింసించేవాడు. ఊరికే డబ్బు తెమ్మని వేధించేవాడు. బొత్తిగా వ్యసనపరుడై... ఏ నిముషాన చంపేస్తాడో అన్న భయంతో... అక్కని పంపటం మానేసాడు నాన్న... డబ్బివ్వ నప్పుడల్లా బెదిరించి వెళ్ళిపోయేవాడు. పుట్టింట్లో వుంటూ చుట్టుపక్కల వాళ్ళ నిందలు పడలేక, బావా నాన్నను పెట్టే హింసలు చూడ లేక అక్క వురేసుకుంది. అది కళ్ళారా చూసిన అమ్మ మతిలేనిదైంది. ఇవన్నీ తెలిసి.... చేసు కుందామని ముందుకొచ్చిన వాళ్ళు కూడా వెనక్కి వెళ్ళిపోవటంతో, తను ఇలాగే వుండిపోయింది. అసలు పెళ్లి చేసుకోవద్దనే నిర్ణయించుకుంది. తమ్ముడి పెళ్ళైపోతే అమ్మని నాన్నని ఎవరు చూస్తారు? కానీ... ఇంటా బయట, నిందలు హేళనలు భరిస్తూ బ్రతకటంకంటే... చేసుకున్నాక అవతలి వ్యక్తి మంచితనం అతను మాత్రం అమ్మనాన్నలని ఎందుకు చూడకూడదు. అందుకే ఈ నిర్ణయానికి వచ్చింది. ఏది ఏమైనా ఇవన్నీ పెళ్ళయ్యాక వచ్చే సమస్యలు కదా... అప్పటి సంగతి...

ఇల్లంతా పెళ్ళి సందడి. కొద్దో గొప్పో అయినవాళ్ళు అయినవాళ్ళమనుకుంటూ వచ్చి తిష్టవేసిన వాళ్ళు... పిల్లజెల్లా చిన్నపెద్దా... ఆడమగా... అంతా చేరి పందిరినిండా కోలాహలంగా వుంది. పట్టుచీరెల రెపరెపలు... గాజుల గలగలు కాలి అందెల సవ్వడులు... సన్నాయి మ్రోతలు... సినిమా పాటలు... సందడి... హడావుడి... ఆలస్యంగా కుదిరిందన్న ఆనందమో... డబ్బుందన్న ఉత్సాహమో... ఘనంగానే ఏర్పాట్లు చేస్తున్నాడు రేఖ తండ్రి. కొద్దిసేపట్లో పెళ్ళివారు వచ్చేస్తారు. వాళ్ళకేలోటు రాకుడదు. హడావుడిపడుతున్నాడు రేఖ తండ్రి.

ఖరీదైన పట్టుచీర... కట్టుకుంది రేఖ. తల్లికి కూడా అంత ఖరీదైందీ కట్టబెట్టింది. తనకి తానే అందరి సాయంతో ముస్తాబు చేసుకుంది. ఇవన్నీ అక్కకి ఆనాడు తల్లి దగ్గరుండి చేసింది. తనకా అదృష్టంలేదు. అడుగడుగునా వెలితి. అయినా... సరిపెట్టుకుంది. మనసుని ఎప్పటికప్పుడు నింపు వరచుకుంటోంది.

కళ్యాణమండపం అందంగా అలంకరిస్తున్నారు. పెళ్ళికి కావలసిన వస్తువులన్నీ... సర్దుకుంటున్నారు పురోహితులు. ఎవరి పన్లు వాళ్ళవి. హడావుడిగా... సందడిగా... కోలాహలంగా... కళకళలాడుతోంది పెళ్ళిపందిరి.

పెళ్ళివార్ని రిసీవ్ చేసుకోటానికి వెళ్లినవాళ్ళు హడావుడిగా పరుగెత్తుకొచ్చారు. భయంతో ఒణికిపోతున్నారు. "ఏమండీ... మరేం... మరి... మనవూరి పొలిమేరల్లో ఏదో గొడవైందట... అట్నుంచి వచ్చే బస్సులు, కార్లు... అదే వాహనాలన్నిటినీ తగలబెట్టేస్తున్నారట. అందులో మన పెళ్ళివారి బస్సు కూడా...

వింటున్న రేఖ పట్టుచీర బరువుగా అయిపోయింది. కళ్యాణం బొట్టు కరిగి ఎర్రటినీరుగా ప్రవహిస్తోంది. కళ్ళ కాటుక, బుగ్గన చుక్క నల్లగా వికృతంగా తయారయ్యాయ్.

"దేముడియ్యని వరానికి... తాను ఆశపడింది. పెళ్ళంటే... కల... కలగానే..." మైకం ఆవహించి స్పృహ తప్పుతోంది. ●

## దివ్యపై విశ్వాసం ఉంది



దివ్యభారతి పెళ్ళి సాజిద్ నాడియావాలతో జరిగిందని ఎన్నో వార్తలు వచ్చాయి. తరువాత దివ్యభారతి పరాయి పురుషులతో తిరుగుతుందన్న వార్తలు కూడా వచ్చాయి. ఈ విషయం సాజిద్‌ని సంప్రదిస్తూ అతను ఈ విధంగా చెప్పాడట.

నేను దివ్య (ప్రేమించుకున్న విషయం అందరికీ తెలిసిందే. అయినా దివ్య పేరును సల్మాన్‌ఖాన్‌తో, అర్మాన్ కొహిలీతో, వార్తల్లో రాస్తారు. ఎన్ని గాసిప్స్ రాసినా నాకు మాత్రం దివ్యపై పూర్తి విశ్వాసం ఉంది.

